క్లుప్తంగా

ధరిత్రి సేవలు అభినందనీయం



డీఎఫ్‌ఓ భరణికి వినాయక ప్రతిమ అందజేస్తున్న ధరిత్రి సమితి అధ్యక్షురాలు సురేఖ

బాలాజీచెరువు: ప్లాస్టిక్ నిషేధంలో 'ధరిత్రి రక్షిత సమితి' కృషి అభినందనీయమని జిల్లా అటవీశాఖాధికారి భరణి పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణ మండలి, ధరిత్రి రక్షిత సమితి ఆధ్వర్యంలో నగరంలో భానుగుడి, సర్పవరం జంక్షన్, జగన్నాథపురం, దేవాలయం వీధి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఉచిత వినాయక మట్టి ప్రతిమలు, క్లాత్ సంచులు, వ్రతకల్పం పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భరణి మాట్లాడుతూ నగర వ్యాప్తంగా మట్టి ప్రతిమల పంపిణీకి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం సంతోషమని, వినాయక చవితిని అందరూ ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షురాలు సీమకుర్తి సురేఖ, సభ్యులు ఎస్.మురళీకృష్ణ, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలను పూజించాలి

కాకినాడ రూరల్: వినాయక చవితి వేడుకల్లో మట్టి ప్రతిమలను పూజించి పర్యావరణను కాపాడాలని ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీ కార్యాలయంలో అడబాల ట్రస్ట్ ప్రచురించిన వినాయక వ్రత పుస్తకాలను ఎంపీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, నల్లం వాసు తదితరులు పాల్గొన్నారు.

రంగరాయ వైస్ ప్రిన్సిపాల్‌కు ఘనంగా వీడ్కోలు



డాక్టర్ దేవీ మాధవిని సత్కరిస్తున్న అధికారులు

కాకినాడ క్రైం: స్థానిక రంగరాయ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ (అకడమిక్స్), కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ బి.దేవీ మాధవికి అధికారులు, సహాధ్యాపకులు గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఆమె విజయనగరానికి బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్, కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో జీజీహెచ్‌లోని ఎస్‌పీఎం గ్యాలరీలో సత్కారం చేశారు. కార్యక్రమానికి డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు, ఆర్ఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ముఖ్య అతిథిగా హాజరై మాధవి వృత్తి నైపుణ్యాన్ని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

వసతిపై క్రీనీడ

- ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడలకు వసతి ప్రశ్నార్థకం
- ప్రారంభించి ఏడేళ్లయినా పూర్తికాని డీఎస్‌ఏ డార్మెటరీ
- రూ.2 కోట్లు నిరుపయోగం
- పూర్తికావాలంటే మరో రూ.40 లక్షలు అవసరం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా క్రీడా మైదానంలో చేపట్టిన డార్మెటరీ నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. సుమారు రూ.రెండు కోట్లతో చేపట్టిన ఈ నిర్మాణంపై శాప్ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. నిర్మాణం ప్రారంభించి ఏడేళ్లు కావస్తున్నా నేటికీ పూర్తికాలేదు. 2016లో అకాడమీ డార్మెటరీ, డైనింగ్, కిచెన్ భవన నిర్మాణానికి అప్పటి శాప్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, శాప్ ఎండీ బంగారాజు శంకుస్థాపన చేసి నిధులు మంజూరు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థతో బిల్డింగ్ ప్లాన్ తయారు చేయించి పూర్తి సదుపాయాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అనంతరం ఆర్‌ఈఎస్ ద్వారా భవన నిర్మాణ పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. శాప్ విడుదల చేసిన డబ్బులతో కేవలం భవనం నిర్మించినప్పటికీ ఎలక్ట్రికల్, బాత్‌రూమ్స్, డోర్లు తదితర పనులు పూర్తి చేయాల్సి ఉంది. ముందు రూ.రెండు కోట్లకు నాలుగు అంతస్తుల నిర్మాణానికి ప్లాన్ వేశారు. ఇప్పుడు గ్రౌండ్ ఫ్లోర్ కూడా పూర్తికాలేదు. ఈ భవనం పూర్తి కావాలంటే రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షలు కావాల్సిందని, అప్పటికీ, ఇప్పటికీ మెటీరియల్ రేట్లు పెరిగిపోయాయని డీఎస్‌ఏ అధికారులు చెప్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి కాకినాడ జిల్లా విడిపోయిన తరువాత డీఎస్‌ఏ తప్ప క్రీడల పరంగా మౌలిక వసతులు కల్గిన సముదాయం మరొకటి లేదు. రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీలు నిర్వహించేటప్పుడు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. పోటీల నిర్వహణ సమయంలో వర్షం వస్తే క్రీడాకారులు ఆరు బయటే భోజనం చేయాల్సి ఉంది. ఇటీవల శాప్‌కు క్యూఆర్ కోడ్ ద్వారా లక్షల రూపాయలు నెలకు అన్ని జిల్లాల నుంచి జమ అవతున్నా దాతల సహకారంతో నిర్మాణ పనులు చూసుకోవాలని శాప్ అధికారులు చెప్పడంపై క్రీడా సంఘం ప్రతినిధులు ముక్కున వేలు వేసుకుంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని భవన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని క్రీడాసంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.



డీఎస్‌ఏలో పూర్తికాని డార్మెటరీ భవన సముదాయం

అక్టోబరులో జాతీయ ఎస్‌జీఎఫ్‌ఐ పోటీల షెడ్యూలు



డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్

పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17, 19లో జాతీయ స్థాయి పోటీల షెడ్యూలు విడుదల అయింది. దీనికి సంబంధించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో సెప్టెంబరు నెలాఖరు, అక్టోబరులో జరిగే ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా 10 వేల మంది క్రీడాకారులు హాజరవుతారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు కాకినాడ జిల్లాలో నిర్వహించాలంటే వసతి లేక నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. డీఎస్‌ఏలో వసతి అందుబాటులోకి వస్తే క్రీడాకారులు డీఎస్‌ఏ దాటి బయటికి వెళ్లే అవకాశం ఉండదని క్రీడా సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. దీనిపై చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్‌ను వివరణ అడగగా డార్మెటరీ భవన నిర్మాణానికి సంబంధించిన లైటింగ్, రంగులు, ఫ్లోరింగ్ చేయాల్సి ఉందన్నారు. సీఎస్ఆర్ ఫండ్స్ నిధుల నుంచి భవన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్‌ను కోరినట్టు తెలిపారు.

డీఎస్‌ఏలో వసతి లేదు



డీఎస్‌ఏలో క్రీడల పరంగా మౌలిక సదుపాయాలు ఉన్నాయి. కానీ వసతి సౌకర్యం లేక రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల నిర్వహణ ప్రశ్నార్థకరంగా మరింది. వసతి సౌకర్యం కల్పిస్తే ధైర్యంగా రాష్ట్ర, జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ పోటీలు నిర్వహణను తీసుకోవచ్చును.

లంక జార్జి, ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి

విజయవాడ ముంపు ప్రాంతాల్లో కార్పొరేషన్ సిబ్బంది సేవలు



వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో పర్యటిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన బృందం ప్రత్యేక విధులు నిర్వహిస్తున్నారు. విజయవాడ 63వ డివిజన్‌లో ఆమె సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ముంపు ప్రాంతాలను పరిశుభ్రం చేయించడం, ప్రజలకు అవసరమైన సేవలు అందించడానికి దాదాపు 150 మంది పారిశుద్ధ్య కార్మికులతో వెళ్లి పనిచేస్తున్నారు. ఆమెతో పాటు డీసీపీ హరిదాస్, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిఈ లోవరాజు, స్మార్ట్ సిటీ ఎస్‌ఈ వెంకటరావు వెళ్లారు.

వరద బాధితులకు మందుల కిట్లు



కిట్లను సిద్ధం చేస్తున్న సెంట్రల్ డ్రగ్ స్టోర్ సిబ్బంది

కాకినాడ క్రైం: విజయవాడ వరద బాధితులకు స్థానిక సెంట్రల్ సీడీఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రత్నరాజు ఆధ్వర్యంలో ఫార్మసీ ఆఫీసర్ పద్మ మీనాక్షి పర్యవేక్షణలో డ్రగ్ స్టోర్ సిబ్బంది పది వేల కిట్లు పంపారు. కాకినాడ వార్ఫ్ రోడ్‌లో ఉన్న సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి ప్రత్యేక వాహనంలో ఈ కిట్లు విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఉన్న రీజినల్ డ్రగ్ స్టోర్‌కు రవాణా అవుతున్నాయి. అక్కడి నుంచి ఆరోగ్య కేంద్రాల ద్వారా ఇంటింటికీ చేరనున్నాయి.

ముంపు పొలాల పరిశీలన

కాకినాడ రూరల్: మండలంలో ముంపునకు గురైన వరి పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి సందర్శించారు. శాస్త్రవేత్త డాక్టర్ ఎ.సీతారామ శర్మ ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలిచ్చారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

బోట్‌క్లబ్: ధన్వంతరి, వరాహ జయంతి సందర్భంగా స్థానిక గోడారిగుంట రమా సహిత సత్యదేవ, దాసాంజనేయ స్వామివార్ల మందిరంలో గురువారం ఉదయం విశేషపూజలను నిర్వహించారు. మధ్వపురోహితులు యాతగిరి మధ్వేష్ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకం చేశారు.

బకాయిలు చెల్లించాలి

బోట్‌క్లబ్: యానిమేటర్ల బకాయిలు చెల్లించకుంటే ఈ నెల తొమ్మిదో తేదీన నిరవధిక నిరాహారదీక్ష చేపడతామని యానిమేటర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగా భవాని అన్నారు. ఈ మేరకు యానిమేటర్లు గురువారం ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తుని, ప్రతిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో రాజకీయ వేధింపులు పెరిగి తొలగింపులకు పాల్పడుతున్నారన్నారు. అనంతరం వారు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు.

కక్ష సాధింపు చర్యలు తగవు

- కూటమి తీరు మారకపోతే ఉద్యమిస్తాం
- ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు కొండేపూడి

కాకినాడ: కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యల్లో భాగంగానే బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను అరెస్టు చేసిందని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేపూడి శ్యాంబాబు విమర్శించారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కక్షసాధింపు చర్యలకు ప్రాధాన్యమిస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రతిపక్ష పార్టీల నేతలపై కేసులు పెట్టడం, దాడులుచేయడం, అరెస్టులు చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఇందులో భాగంగానే మాజీ ఎంపీని అరెస్టు చేసిందన్నారు. అవసరమైతే వైఎస్సార్ సీపీతో కలిసి మాదిగలంతా ఎమ్మార్పీఎస్ తరపున ఉద్యమిస్తారాన్నరు. మాదిగల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించవద్దని ఆయన కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

నిమజ్జనాలను విజయవంతం చేయాలి



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ కిశోర్

- ఆర్డీఓ కిశోర్
- ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారుతో సమీక్ష

బోట్‌క్లబ్: వినాయక చవితి, గణేష్ నిమజ్జనాలను విజయవంతం చేయడానికి ప్రతి శాఖ అధికారులు కృషి చేయాలని ఆర్డీఓ ఇట్ల కిశోర్ అన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు, భద్రతా చర్యలపై ఆయన తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. స్థానిక జగన్నాథపురం, కాకినాడ రూరల్ సూర్యారావుపేటలో ఏటా పెద్ద ఎత్తున గణేష్ నిమజ్జనాలు జరుగుతున్నందున అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, భారీ క్రేన్లు, గజ ఈతగాళ్లు, భద్రత తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులకు సూచించారు. ఈ సమాచారాన్ని ఉత్సవ నిర్వాహకులకు, కమిటీలకు సూచించాలన్నారు. డీఎస్పీ రఘువీర్ విష్ణు మాట్లాడుతూ నిర్దేశించిన ప్రాంతంలో మాత్రమే నిమజ్జనాలు చేయాలని ఉత్సవ నిర్వాహకులను కోరారు. సమావేశంలో మున్సిపల్ డీఈ మాధవి, నగర గణేష్ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న నర్సింగ్ విద్యార్థినులు

కరప: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని కాకినాడ గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినులు సూచించారు. ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్‌లో భాగంగా గురువారం వారు కరపలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారుల ఆరోగ్య విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను తల్లులకు వివరించారు. నడకుదురు జనావళి అనాథాశ్రమంలో వృద్ధులను కలిసి వారికి పలు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. అనంతరం పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై జరిగిన సదస్సులో పాల్గొన్నారు. నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.మునిరత్నమ్మ, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ భాస్కరరావు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు ఎస్పీకి ఆహ్వానం

కాకినాడ: కాకినాడ దిగుమర్తి వారి వీధిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలకు కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఆహ్వానం అందజేశారు.

గురువారం ఆమె ఆహ్వాన కమిటీ సభ్యులతో కలిసి ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉత్సవ నిర్వహణకు సంబంధించి ఈ ఏడాది ధాన్యాలతో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఇతర వివరాలు తెలియజేసి ఆహ్వాన పత్రికను ఎస్పీకి అందజేశారు. కార్యక్రమంలో ఆమె వెంట పలువురు ఆహ్వాన కమిటీ సభ్యులు ఉన్నారు.



జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను ఆహ్వానిస్తున్న చంద్రకళాదీప్తి

ఎంఎల్‌సీ కేసులపై అవగాహన అవసరం



డాక్టర్ సుధీర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందించి ధన్యవాదాలు తెలుపుతున్న ఆసుపత్రి అధికారులు



ఉపాధ్యాయ దినోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

- గురుపూజోత్సవం సందర్భంగా జీజీహెచ్‌లో సీఎంఓలకు శిక్షణ

కాకినాడ క్రైం: జీజీహెచ్ సీఎంవోలకు మెడికో లీగల్ కేసు(ఎంఎల్‌సీ)లపై అవగాహన తరగతులు నిర్వహించారు. గురువారం గురుపూజోత్సవం సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి రూపకల్పన చేశారు. అత్యవసర విభాగం నిర్వహణలో విశేష అనుభవం ఉన్న విశ్రాంత ఆర్ఎంవో డాక్టర్ సుధీర్‌ను శిక్షకుడిగా ఆహ్వానించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులు అర్పించి డాక్టర్ లావణ్య కుమారి శిక్షణను ప్రారంభించారు. డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ అత్యవసర విభాగం ఆసుపత్రికి గుండె వంటిదని, ఒకటి, రెండేళ్ల అనుభవం ఉన్న సీఎంవోలు ఎంఎల్‌సీ కేసులపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. కేసు రాయడంలో ఏ మాత్రం అవగాహనాలేమి ఎదురైనా బాధితుడు బాధ్యుడిగాను, బాధ్యుడు బాధితుడిగానూ మారే ప్రమాదం ఉందన్నారు. అలాగే కేసు రాసిన సీఎంవోలు చట్టపరమైన చిక్కుల్లో పడాల్సి ఉంటుందన్నారు. క్రాస్ ఎగ్జామినేషన్‌లో డాక్టర్ పేరు ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంటుందనీ, అటువంటి సమయంలో కోర్టుకు హాజరుకావలసి ఉంటుందని తెలిపారు. కోర్టుకు హాజరైతే అక్కడ అనుసరించే నియమావళిని సీఎంవోలకు వివరించారు. గాయాల స్థితి రాసే విధానం, కాలిన గాయాల కేసుల్లో మరణవాంగ్మూలం, వూండ్ సర్టిఫికెట్ పంపే విధానాలపై ఆయన వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్‌కు ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌వోడీ, క్యాజువాలిటీ ఇన్‌చార్జి డాక్టర్ కె.సత్యవాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసన్, డాక్టర్ లావణ్యకుమారి పుష్పగుచ్ఛాన్ని అందించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 10 మంది సీఎంవోలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే సత్కారం

కరప: మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన, అవార్డులు అందుకున్నవారిని ఎమ్మెల్యే పంతం నానాజీ ఘనంగా సత్కరించారు. స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవాలకు ఆయన హాజరై సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న ఐదుగురితో పాటు కాంప్లెక్స్ వారీగా ఎంపికైన ఆరుగురు ఉత్తమ ఉపాధ్యాయులు, బెస్ట్ సీఆర్‌పీ, బెస్ట్ స్టాఫ్ కేటగిరిల్లో అవార్డులందుకున్న వారిని ఎమ్మెల్యే సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కొప్పుల బులి కృష్ణవేణి, సత్యనారాయణ, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. నడకుదురు జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ ఆరోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొని ఉపాధ్యాయులను సత్కరించారు. కరప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, హెచ్ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌డీ అధ్యాపకుడికి సత్కారం



అధ్యాపకుడు సత్యనారాయణను సత్కరిస్తున్న శివప్రసాద్ తదితరులు

బాలాజీచెరువు: అన్నవరం సత్యవతీదేవి జూనియర్ కళాశాల సివిక్స్ అధ్యాపకులు చింతా వీరవెంకట సత్యనారాయణను గురువారం గైగోపాలు ఎస్‌బీఐ మెయిన్‌బ్రాంచ్ మేనేజర్ అద్దంకి శివప్రసాద్ ఆధ్వర్యంలో సత్కరించారు. సమాజానికి ఉపాధ్యాయులు మార్గదర్శకులని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ఎన్ మూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేతన్నలకు బోనస్, డివిడెండ్ల పంపిణీ

పెద్దాపురం: సంక్షోభంలో ఉన్న చేనేత కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు అన్నారు. స్థానిక చేనేత సహకార భవనంలో గురువారం కార్మికులకు బోనస్‌లు, డివిడెండ్లను ఆయన పంపిణీ చేశారు. సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి సీహెచ్‌ఏవీ రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో వీర్రాజు మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా విక్రయించే వస్త్రాలకు రిబేట్ ఇవ్వాలన్నారు. చేనేత సొసైటీలకు పావలా వడ్డీకి రుణాలివ్వాలని వీర్రాజు అన్నారు. రవికుమార్ మాట్లాడుతూ సొసైటీలో 237 మంది సభ్యులు ఉండగా వీరిలో వస్త్రాలు తయారు చేసే 47 మంది కార్మికులకు రూ.1,23,320 బోనస్‌గా వచ్చిందన్నారు. 237 మందికి రూ.1,08,057 డివిడెండ్ వచ్చిందన్నారు. అనంతరం వారికి వీర్రాజు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ తూతిక చంద్రశేఖర్, ఎం.చంద్రశేఖర్, టి.ప్రసాదరావు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

ఆక్రమణ నుంచి చెరువుకు విముక్తి

సర్వే చేసి హద్దులు గుర్తించిన అధికారులు

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురం, జగ్గమ్మగారిపేట ఇరిగేషన్ చెరువు ఆక్రమణకు గురైనట్టు అధికారులు గుర్తించారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ఆ వివరాలను విలేకర్లకు తెలిపారు. ఈ ఆక్రమణలపై ఫిర్యాదుల మేరకు గత నెల 16వ తేదీన చెరువు పూడ్చివేత పనులను నిలిపి వేయించామన్నారు. చెరువు పూడ్చి లే అవుట్‌కు ప్రయతిస్తున్నారనే ఫిర్యాదుల మేరకు తమ సిబ్బందితో చెరువును అప్పట్లో పరిశీలించామని చెప్పారు. ఆ సందర్భంగా పూడ్చివేస్తున్న వ్యక్తి ఈ చెరువుపై తమకు హక్కులు ఉన్నాయని చెప్పడంతో రికార్డులు తీసుకురావాలని కోరామన్నారు. సదరు వ్యక్తి ఏ రికార్డులు సమర్పించకపోవడంతో ఆక్రమణగా నిర్ధారించి గురువారం నీటిపారుదల అధికారులకు సమాచారం ఇచ్చి చెరువు సంబంధిత రికార్డులతో హాజరుకావాలని సూచించినట్టు తెలిపారు. వారి రికార్డుల మేరకు చెరువు ఆక్రమణ వెలుగులోనికి వచ్చిందన్నారు. చెరువును ఆక్రమించి సాగు చేసుకుంటున్నట్లు సర్వేలో వెలుగులోనికి వచ్చింది. ఈ చెరువును ఇరిగేషన్ జేఈ వీరబాబు, మత్స్యకార సొసైటీ సభ్యులు గొర్రెల అప్పారావు, రమణ, అందుగుల జార్జి చక్రవర్తిల సమక్షంలో తహసీల్దార్ సర్వే చేయించారు. సర్వేయర్ సుబ్రహ్మణ్యం తన సిబ్బందితో చెరువు హద్దులను గుర్తిం మక్కులు ఏర్పాటు చేశారు. చెరువు రక్షణకు ఏర్పాట్లు చేసుకోవాలని తహసీల్దార్ ఇరిగేషన్ అధికారులకు సూచించారు. సర్వే నెంబరు 94-6 లోని 12.41 ఎకరాలను సర్వే చేయించి ఇరిగేషన్ ఏఈ వీరబాబుకు అప్పగించిన్నట్లు తహసీల్దార్ తెలిపారు.

నిరుపేద కుటుంబానికి భరోసా

సామర్లకోట: స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద నివసిస్తున్న ఝాన్సీ భర్త ఇటీవల చనిపోవడంతో కుటుంబం ఆకలితో అలమటిస్తోంది. ఆమెకు ఒక కుమార్తు, కుమార్తె ఉన్నారు. కుమార్తు ప్రైవేటు స్కూల్‌లో ఐదవ తరగతి, కుమార్తె ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక భరోసా సంస్థ ప్రతినిధులు నెలకు సరిపడే నిత్యావసర సరకులు, ఝాన్సీ కుమారుడు చదువుతున్న ప్రైవేటు స్కూల్ ఫీజును చెల్లించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శేషారెడ్డి, జీఎస్ఎన్ సతీష్, గంగాధర్, ఎ.నాగబాబు పాల్గొన్నారు.



నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరకులు అందిస్తున్న భరోసా సంస్థ ప్రతినిధులు